
సాక్షి
గుంటూరు

శనివారం । 4 । జనవరి । 2025

I



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 569.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,633 క్యూసెక్కులు వదిలారు.



వైభవంగా దీపోత్సవం

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం కుత్తు విళక్కు-విశేష పాశురం, దీపోత్సవం జరిగాయి.



వేడుకగా కల్యాణ మహోత్సవాలు

గుంటూరురూరల్: గోరంట్లలోని వేంకటేశ్వర స్వామి పెద్ద గుడిలో దశావతార కల్యాణ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామిని వామనావతారంలో అలంకరించారు.

న్యూస్‌రీల్

వైభవంగా ధనుర్మాస మహోత్సవాలు



తాడేపల్లి రూరల్ : త్రిదండి చిన్న జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ధనుర్మాస వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మంగళగిరి బాపూజీ విద్యాలయంలో 19వ రోజు 19వ పాశురాన్ని భక్తులకు ఆయన వివరించారు. అనంతరం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా సీతానగరం జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ.. పలు ప్రాంతాల నుంచి సుమారు 700 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి.

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్షలు



నగరంపాలెం: గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 216 మంది హాజరయ్యారు. 26 మందికి ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనక్కు పంపారు. మిగతా వారిలో 10 మందికి బరువు, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. 113 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీలు జరగ్గా ఐదుగురు, 113 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా 106 మంది అర్హత పొందారు. మొత్తమ్మీద 198 మందికి దేహదారుఢ్య పరీక్షలు జరగ్గా, 106 మంది అర్హత సాధించారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), ఎ.హనుమంతు(ఏఆర్) పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన స్కేటింగ్ క్రీడాకారిణి



తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్‌ను మంగళగిరికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి మాత్రపు జెస్సీ రాజ్ శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. జెస్సీ రాజ్ ఇటీవల రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు అందుకుంది. స్కేటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ పురస్కారం దక్కింది. ఆమెను మంత్రి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఆమెతోపాటు కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

జీఎన్ఎం వార్షిక పరీక్షలు ప్రారంభం



గుంటూరు మెడికల్: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు మెడికల్ కాలేజ్, ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో జిల్లా వ్యాప్తంగా 36 నర్సింగ్ స్కూల్స్ నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈనెల 11 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. తొలిరోజు 1500 మందికిగాను ఫైనల్ ఇయర్ విద్యార్థులు 20 మంది, ఫస్ట్ ఇయర్ వారు 94 మంది గైర్హాజరైనట్లు గుంటూరు జీజీహెచ్ ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ కోటా సుజాత తెలిపారు. పరీక్షల చీఫ్ ఎగ్జామినర్‌గా గుంటూరు జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్ వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు.

ఇంత నిర్దయా బాబు..!

బకాయిల కోసం జంపని చక్కెర ఫ్యాక్టరీ ఉద్యోగుల ఎదురుచూపు

టీడీపీ ప్రభుత్వ హయాంలో మూతపడిన జంపనిలోని సహకార చక్కెర ఫ్యాక్టరీ ఉద్యోగులు నేటికీ తమకు రావాల్సిన వేతన బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ బకాయిల చెల్లింపునకు, ఉన్న ఉద్యోగుల వీఆర్ఎస్‌కు వీలుగా జీవో ఇచ్చింది. రూ.14.07 కోట్ల బకాయిల్లో తొలి విడతగా రూ.3.70 కోట్లను విడుదల చేసింది. మిగిలిన నిధుల విడుదల కోసం సీఎం చంద్రబాబు ఇకనైనా స్పందించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

- టీడీపీ ప్రభుత్వ హయాంలో కర్మాగారం మూసివేత
- వైఎస్సార్ చొరవ, కార్మికుల పోరుతో తిరిగి 'సహకారం'లోకి..
- అసమర్థ నిర్వహణతో మళ్లీ మూసివేత
- ఉద్యోగులకు జీతాలు చెల్లించని నాటి పాలకులు
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఉద్యోగులకు బకాయిల చెల్లింపు, వీఆర్ఎస్‌కు వీలుగా జీవో జారీ
- తొలి విడతగా రూ.3.70 కోట్లు విడుదల
- మిగిలిన బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి బాధితుల డిమాండ్



జంపనిలోని చక్కెర ఫ్యాక్టరీ (ఫైల్)

తెనాలి/వేమూరు: తెనాలి సమీపంలోని ప్రస్తుత బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న జంపని చక్కెర ఫ్యాక్టరీ తెనాలికి చెందిన సహకారోద్యమకారుల మానస పుత్రిక. 1974లో శంకుస్థాపన జరిగినా ఎన్నో ఆటుపోట్ల తర్వాత 1984 ఫిబ్రవరిలో క్రషింగ్ ప్రారంభించారు. 2012లో మూత పడేంతవరకు మూడు సీజన్లలోనే సామర్థ్యానికి సరిపడా రూ.1.60 లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేయగలిగింది. చెరకు విస్తీర్ణాన్ని తగినంత పెంచటంలో టీడీపీ పాలక వర్గాలు విఫలమయ్యాయి.

వైఎస్సార్ హయాంలో ఊరట

ఈ నేపథ్యంలో 2002-03లో నాటి టీడీపీ ప్రభుత్వం సహకార చక్కెర ఫ్యాక్టరీలను దశలవారీగా ప్రైవేటుపరం చేసింది. అదే ఏడాది జంపని ఫ్యాక్టరీని జయపూర్ షుగర్స్‌కు అప్పగించారు. తర్వాత తమకు వద్దని ఆ సంస్థ వెనక్కి వెళ్లింది. దీంనితో క్రైబ్స్ బయో కెమికల్స్‌కు విక్రయించారు. కార్మికులు, ఉద్యోగులు ఆందోళన చేసినా ఫలితం లేకుండాపోయింది. 2004వ సంవత్సరంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తిరిగి 'సహకారం'లోకి తీసుకొచ్చేందుకు చొరవచూపారు. ఉన్నత న్యాయస్థానాల్లోనూ అనుకూలంగా ఉత్తర్వులు రావటంతో 2004 డిసెంబరులో సహకారం రంగంలోకి ఫ్యాక్టరీ వచ్చింది. మూడు నాలుగేళ్లు బాగానే నడిచినా 2008-09, 2009-10, 2020-11 సీజన్లలో మూతపడింది. తెరిపించేందుకు నాటి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న మోపిదేవి వెంకట రమణారావు రూ.5.08 కోట్ల రుణం మంజూరు చేయించారు. సకాలంలో అవి అందకుండా చేయటంలో చంద్రబాబు అనుకూలురైన ఓ ఉన్నతాధికారి చక్రం తిప్పారని ఆరోపణలున్నాయి. నిధుల జాప్యంతో రైతులతో అగ్రిమెంట్లు చేసుకోలేకపోయారు. అధికమొత్తం చెరకు కృష్ణా జిల్లాలోని ప్రైవేటు ఫ్యాక్టరీకి తరలిపోయింది. 2012 సీజనులో కేవలం 15 టన్నుల చెరకు మాత్రమే క్రషింగ్ చేయగలిగారు.

రోడ్డున పడ్డ ఉద్యోగులు

ఫ్యాక్టరీ మూసివేతతో ఉద్యోగులు రోడ్డున పడ్డారు. వారికి ఏళ్ల తరబడి జీతాలు లేవు. ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా ఫలితం లేదు. తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడ్డాక దీనిపై దృష్టి సారించారు. ఏళ్ల తరబడి మూసి ఉన్న జంపని ఫ్యాక్టరీలో యంత్రాలు తుప్పుపట్టిపోయాయి. దీంతో 2013 జులై నుంచి ఏప్రిల్ 2022 వరకు కటాఫ్ తేదీ నిర్ణయించి రిటైరైన ఉద్యోగులకు బకాయిల చెల్లింపు, సర్వీసు కలిగిన వారికి వీఆర్ఎస్ ఇవ్వటం, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు ఆరు ఫ్యాక్టరీలకు మొత్తం రూ.108.32 కోట్లు ఇచ్చేందుకు 2022-23లో జీవో విడుదల చేశారు. ఆ మొత్తంలో జంపని ఫ్యాక్టరీకి రూ.14.07 కోట్లు రావాల్సి ఉంది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయంపై ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమైంది. బకాయిలు, సర్వీసు ఉన్నవారికి జీవో ప్రకారమే 2023 డిసెంబరులో రూ.3.70 కోట్లను విడుదల చేశారు. తర్వాత ప్రభుత్వం మారిపోయింది. ఇప్పుడు కూటమి సర్కారు మిగతా బకాయిలను చెల్లించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

అవయవదానంతో పునర్జన్మ

మంత్రి సత్యకుమార్ యాదవ్

గుంటూరు మెడికల్: తల్లి జన్మనిస్తే.. అవయవదానం పునర్జన్మనిస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో శుక్రవారం అఖిల భారత శరీర అవయవదాతల సంఘం ఐదో మహాసభ, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు (స్పెక్ట్) 21వ వార్షికోత్సవం, సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాలు జరిగాయి. ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడుతూ అవయవ దానంపై అవగాహన అభినందనీయం అన్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి ఏడాది ఐదు లక్షల మంది అవయవాల కోసం పేర్లు నమోదు చేయించుకున్నట్లు తెలిపారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి ఎనిమిది మందికి నూతన జీవితం ప్రసాదించవచ్చని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలేను ప్రజలు ఇంకా గుర్తుపెట్టుకోవడానికి కారణం ఆమె మహిళల విద్యకు, సామాజిక సంస్కరణకు చేసిన కృషి అన్నారు. గతేడాది కంటే ఈ సారి 60 నుంచి 70 శాతం ట్రాన్స్‌ప్లాంటేషన్లు, డోనర్స్ పెరిగారన్నారు. 65 మంది అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చారని, 205 ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరిగాయన్నారు. స్పెక్ట్ సేవలను కొనియాడారు. పేద ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఎవరైనా అవయవాలు విక్రయిస్తే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. గతంలో విజయవాడలో జరిగిన సంఘటనపై కూటమి ప్రభుత్వం తీవ్రంగా స్పందించిందన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది సేవా రంగాన్ని ఎంచుకున్నారని, తొలుత వారు అవయవదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ.. స్పెక్ట్ సంస్థ సేవలను అభినందించారు. అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా తమ సంస్థ సేవలు అందిస్తోందన్నారు. ఆర్గాన్ డొనేషన్ చేసేవారికి ప్రభుత్వం రూ. 10 వేలు ప్రోత్సాహకం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. స్పెక్ట్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ.. గుంటూరు జీజీహెచ్‌ను ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్‌గా అభివృద్ధి చేస్తే బాగుంటుందన్నారు. విద్యార్థులకు అవయవదానంపై పాఠ్యాంశాన్ని ప్రవేశపెట్టాలని, డ్రైవింగ్ లైసెన్సు మంజూరు సమయంలో అవయవదానం ప్రతిజ్ఞ చేయించాలన్నారు. గుండె, ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలేకు స్పెక్ట్ సంస్థ తరఫున సావిత్రిబాయి పూలే జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం అవార్డు గ్రహీత మాట్లాడుతూ.. జీవితం చాలా చిన్నదని, ప్రతి జీవి సంఘానికి ఏదో ఒకటి చేయాలన్నారు. గుంటూరు వైద్య కళాశాలకు తన శరీరాన్ని దానంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యక్తులకు కూడా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ గోపాలకృష్ణ గోఖలేను సన్మానిస్తున్న మంత్రి సత్యకుమార్, కృష్ణబాబు

అడ్డొస్తే టిప్పర్‌తో తొక్కించి చంపుతాం!



విచ్చలవిడిగా మట్టిని తవ్వి తరలిస్తున్న దృశ్యం

- రెచ్చిపోతున్న కూటమి నేతల మైనింగ్ మాఫియా
- మైనింగ్‌ను అడ్డుకుంటే ప్రాణాలైనా తీస్తామని హెచ్చరిక
- తమను కాపాడాలని జగనన్న కాలనీవాసుల వినతి
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆవేదన

గుంటూరు రూరల్: అధికారం వారిది కావడంతో చేసే అక్రమాలకు ఎవరైనా అడ్డొస్తే ప్రాణాలైనా తీస్తామని కూటమి నేతల మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది. అడ్డుకుంటే టిప్పర్‌లతో తొక్కించి చంపేస్తామని స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో మైనింగ్ మాఫియా ఆగడాలకు అడ్డేలేకుండా పోయింది. స్థానిక ప్రజా ప్రతినిధి కనుసన్నల్లోనే ఈ మాఫియా నడుస్తోందని ఆరోపణలు ఉన్నాయి. దీంతో అటువైపు కన్నెత్తి చూసే అధికారి లేకుండా పోయాడు. ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామ పంచాయతీలో అక్రమ మైనింగ్ చేస్తూ స్థానిక జగనన్న కాలనీమీదుగా నిత్యం వందల సంఖ్యలో హెవీ టిప్పర్‌లు తిరుగుతూనే ఉన్నాయి. అనుమతులు లేకున్నా ఇష్టం వచ్చినట్లు తవ్వకాలు చేస్తూ రూ.కోట్లలో ప్రజా ధనాన్ని కూటమి నాయకులు కొల్లగొడుతున్నారు. టిప్పర్ లారీల వల్ల తమకు ప్రమాదం పొంచి ఉందని ప్రజలు వాపోతున్నారు. కాలనీలోని ప్రధాన రహదారులు పెద్దపెద్ద గుంతలు పడి తమకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఆ గుంతలను పూడ్చాలని కోరితే మైనింగ్ మాఫియా బరితెగిస్తోందన్నారు. అడ్డొస్తే టిప్పర్‌తో తొక్కిస్తాం అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. దీంతో అధికారులకు బాధితులు ఫిర్యాదు చేశారు. తమను కాపాడాలని కోరారు. భారీ వాహనాల వల్ల కనీసం కాలనీలోకి ఆటోలు కూడా రావటం లేదని వాపోయారు. చిన్న వాహనాలు నడపలేని దుస్థితి నెలకొందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణాలు ఇబ్బందికరంగా మారాయని కాలనీ వాసులు వాపోతున్నారు.



రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న నడింపాలెం గ్రామం జగనన్న కాలనీ ప్రజలు

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

మైనింగ్ అక్రమాలకు పాల్పడుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం స్పందన లేదని స్థానికులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. మట్టిని అడ్డగోలుగా తరలించి రూ.కోట్లలో ఆదాయం పొందుతున్న మాఫియాను అడ్డుకునే వారే లేరా? అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, చెరువులు.. ఇలా ఎక్కడ చూసినా మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. రూరల్ మండలంలోని నాయుడు పేట, ఓబులునాయుడు పాలెం, పొత్తూరు, వెంగళాయపాలెం, తాడికొండ మండలంలోని లాం గ్రామాల్లో విచ్చలవిడిగా మైనింగ్‌కు పాల్పడుతున్నారని గుర్తుచేశారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిశీధిలో ఉదయించిన విజ్ఞాన సూరీడు

- పుట్టుకతో చూపు లేకున్నా ఉన్నత చదువులు
- ఆచార్యుడిగా ఎదిగి ఎందరికో విద్యాబోధన
- సంగీత, సాహిత్యాలతోనే విశ్రాంత జీవనం
- స్ఫూర్తిదాయకం మన్నవ జీవన ప్రయాణం
- నేడు ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం



ఆచార్య మన్నవ సత్యనారాయణ

తెనాలి: 'అమ్మా..! వెలుగంటే ఏమిటమ్మా... లోకమంతా నాకు కనిపించినట్లే చీకటిగా ఉంటుందా?' అంధుడిగా పుట్టిన ఓ బాలుడు మాటలు నేర్చాక తల్లిని అడిగిన ప్రశ్న! అందుకా తల్లి బిడ్డను ఒళ్లోకి తీసుకుని చెమ్మగిల్లిన కళ్లతో...

'చీకటంటే అజ్ఞానం, వెలుగంటే విజ్ఞానం, చీకటిని చీల్చుకుంటూ వెలుగొస్తుంది... అజ్ఞానాన్ని హరిస్తూ జ్ఞానం ప్రసరిస్తుంది... ప్రభవిస్తుంది నాన్నా ' అని చెప్పింది.

అప్పట్లో ఆ మాటలు ఎలా అర్థమయ్యాయో తెలీదు... చదువుకోవాలని మాత్రం బాలుడు అనుకున్నాడు. స్పర్శనే కళ్లు చేసుకున్నాడు. బ్రెయిలీ అక్షరాలే నేస్తాలయ్యాయి. ఉన్నత చదువులు చదివారు. ఎందరికో విజ్ఞాన వెలుగులు పంచారు. ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా ఆ ఆచార్యుడి పరిచయమిది. తన చుట్టూ ఉన్న చీకటి ప్రపంచంలో విజ్ఞాన వెలుగులతో ప్రభవించిన ఆ విద్యావేత్త డాక్టర్ మన్నవ సత్యనారాయణ. సొంతూరు తెనాలి సమీపంలోని దుగ్గిరాల గ్రామ శివారు గాంధీనగర్. వ్యవసాయ కుటుంబంలో 1953 డిసెంబర్ 22న జన్మించారు. తల్లిదండ్రులు జయమ్మ, వెంకట్రామయ్య. బిడ్డ పుట్టగానే ఎంతో సంతోషించారు. బిడ్డకు కంటిచూపు లేదని తెలిశాక వారి దుఃఖానికి అవధుల్లేవు. వైద్యం కోసం తిరగని ఆస్పత్రి లేదు. కంటిచూపు రావడం కష్టమని తెలిశాక గుండెను రాయి చేసుకుని పెంచుకున్నారు.

చదువులో మేటి..

ఇంటి సమీపంలోని స్నేహితులతో కలిసి బడికి వెళ్లటం ఆరంభించారు సత్యనారాయణ. చూపు లేకున్నా, తన చెవులనే జ్ఞానచక్షువులుగా చేసుకున్నారు. ఏకసంథాగ్రాహి అనిపించుకున్నాడు. చెప్పిన పాఠాలను గుర్తుంచుకుని, సమాధానాలను రాయటంతో టీచర్లు అబ్బురపడ్డారు. చదువుపై ఆసక్తితో గుంటూరులోని అంధుల పాఠశాలలో చేరారు. బ్రెయిలీ లిపి నేర్చుకున్నాడు. 17వ ఏటనే ఆంధ్రా యూనివర్సిటీ మెట్రిక్యులేషను పరీక్ష రాసేందుకు సిద్ధమయ్యాడు. 6 - 9 తరగతులు చదవకుండా మెట్రిక్ ఎలా పాసవుతావని తల్లిదండ్రులు, స్నేహితులు వారించారు. అయినా పట్టుదలతో చదివి ఆ ఏడాదే మెట్రిక్ పాసయ్యారు. గుంటూరులోనే హిందూ కాలేజీలో పీయూసీ, డిగ్రీ పూర్తి చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ పీజీ సెంటర్లో ఎంఏ చదివి ఫస్ట్‌క్లాసులో పాసయ్యారు.

విద్యార్థులకు బాసటగా...

కేవలం పదేళ్ల సర్వీసులో 21 మంది విద్యార్థులతో పీహెచ్‌డీ చేయించారు. 19 మందితో ఎంఫిల్ డిగ్రీ పూర్తి చేయించారు. యూజీసీ జాతీయ సదస్సులు, పునశ్చరణ తరగతుల నిర్వహణలోనూ పేరు తెచ్చుకున్నారు. 2013లో ఉద్యోగ విరమణ అనంతరం కూడా కొన్నేళ్లపాటు స్వచ్ఛందంగా విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. రోజూ ఆటోలో యూనివర్సిటీకి వెళ్లి విద్యాబోధనతో సంతృప్తి పొందారు. కరోనా విపత్కర పరిస్థితులతో తప్పనిసరై విరామం ప్రకటించారు.

సంగీత, సాహిత్యాలపైనా పట్టు

ఆచార్య మన్నవకు సంగీత సాహిత్యాలంటే ఎంతో అభిరుచి. సాహిత్యాన్ని గురువు ద్వారా నేర్చుకుని, సంగీతంలో స్వీయ సాధన చేశారు. పాత సినిమాల్లోని ఆపాత మధురాలైన పాటలంటే ప్రాణం. మన్నాడే, రఫీ, ముఖేష్, కిషోర్‌కుమార్, ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, సుశీల పాటలు వింటూ పరవశించిపోతారు. సంగీతం, పాటల పోటీలకు న్యాయనిర్ణేతగానూ వ్యవహరిస్తూ వచ్చారు. తెనాలిలోని ఓ సంగీత, సాంస్కృతిక సంస్థకు గౌరవాధ్యక్షుడిగానూ వ్యవహరించారు. ఇప్పటికీ సాహిత్య సభలకు హాజరవుతుంటారు. శరీరంలో ఓ లోపానికి కుమిలిపోకుండా పట్టుదలతో శ్రమిస్తే జీవితానికి సార్థకత లభిస్తుందని చెప్పడానికి నిదర్శనంగా నిలిచి అందరికీ ఆయన స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తున్నారు.

సీటు ఇవ్వని చోటే విభాగాధిపతిగా..



ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పీహెచ్‌డీ పరిశోధనకు మన్నవ దరఖాస్తు చేశారు. 'ఓ అంధుడు ఎలా పరిశోధన చేస్తారు... ఆయనకు గైడ్‌గా ఎవరుంటారు' అంటూ నాటి తెలుగు శాఖాధిపతి పట్టించుకోనేలేదు. కానీ ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం ముందుకొచ్చారు. అయినా మన్నవ సత్యనారాయణకు సీటిచ్చేందుకు ససేమిరా అన్నారు. చివరకు వీసీ చొరవతో పరిశోధనకు అవకాశం లభించింది. పట్టుదలతో పీహెచ్‌డీ పూర్తిచేసిన మన్నవ.. అదే యూనివర్సిటీలో ఆచార్యుడిగా చేరి, తెలుగు శాఖాధిపతిగా కూడా ఎదిగారు. తనకు సీటిచ్చేందుకు నిరాకరించిన కుర్చీలోనే తాను తలెత్తుకుని కూర్చోగలిగారు. అంతేకాదు... దేశంలో దృష్టిలోపం కలిగిన వారిలో తొలిసారి పీహెచ్‌డీ చేసింది ఆయనే కావటం విశేషం! మన్నవ తన పీహెచ్‌డీ పరిశోధనకు ప్రఖ్యాత రచయిత అడవి బాపిరాజు నవలలు ఎంచుకున్నారు. హిమబిందు, తుపాను, నారాయణరావు, కోనంగి, జాజిమల్లి, నరుడు, అడవి, శాంతిశ్రీ, అంశుమతి, గోనగన్నారెడ్డి నవలల్ని చదివి, తన పరిశోధనా థీసిస్‌ను సమర్పించారు. రొటీన్ పరిశోధక థీసిస్‌లకు భిన్నంగా ఉండటంతో పండితులు, సాహితీవేత్తలు ఆయనను అభినందించారు.

45,194 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 40,012 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 45,194 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.16,200 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,000 నుంచి రూ.16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 44,381 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

యాజమాన్యాలకు మళ్లీ నోటీసులు ఇస్తాం


- పాత విధానంలో మార్పు లేదన్న డీఈవో
- "కూటమి లక్ష్యం.. ఎయిడెడ్!" కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తూ ప్రభుత్వం చేపట్టిన చర్యలపై ''కూటమి లక్ష్యం... ఎయిడెడ్!'' శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక స్పందించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 14 ఎయిడెడ్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యాశాఖ నిబంధనల ప్రకారం ప్రవేశాలు పెంచుకోకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. గతేడాది విద్యార్థుల సంఖ్య 20 కంటే తక్కువగా ఉండి, ప్రస్తుత విద్యాసంవత్సరంలోనూ ఆ సంఖ్య మెరుగుపరచుకోని పాఠశాలలకు రెండోసారి నోటీసులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేటు రంగంతో పోటీ పడలేని ఎయిడెడ్ పాఠశాలల సిబ్బంది, ఆస్తులతో సహా ప్రభుత్వానికి అప్పగించేందుకు సంబంధించిన విధానం ఇప్పటికీ అమల్లో ఉన్నట్లు తెలిపారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1716 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 140, తూర్పు కెనాల్‌కు 174, నిజాంపట్నం కాలువకు 34, కొమ్మమూరు కాలువకు 975 క్యూసెక్కులు విడుదల చేశారు.



వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **2,500** గరిష్టం : రూ. **3,000**

మోడల్ ధర రూ. **2,700**

క్లుప్తంగా

5న గ్రూప్-1 ఉచిత శిక్షణకు పరీక్ష



గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద కమ్మ సామాజిక విద్యార్థినులకు గ్రూప్-1 ఉచిత శిక్షణ, వసతి సదుపాయాలను కల్పించనున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ పీవీ లక్ష్మయ్య తెలిపారు. కుందులరోడ్డులోని కమ్మజన సేవా సమితిలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో లక్ష్మయ్య మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన గుంటూరులోని జేకేసీ కళాశాలలో, వినుకొండ, హైదరాబాద్‌లలోని తమ సంస్థ కార్యాలయాల్లో ఎంపిక పరీక్ష జరుగుతుందని చెప్పారు. విద్యార్థినులు 83309 34815 నంబరుకు వివరాలను పంపాలని కోరారు. సమావేశంలో కమ్మజన సేవా సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్, సభ్యులు సీతారామయ్య, పెద్ది సాంబశివరావు, చావా బోస్ పాల్గొన్నారు.

రైల్వే పురస్కార గ్రహీతలకు అభినందన

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ముగ్గురికి జోనల్ స్థాయిలో 69వ రైల్వే వారోత్సవాల్లో విశిష్ట రైల్ సేవా పురస్కారాలు దక్కడంతో వారిని డీఆర్‌ఎం రామకృష్ణ అభినందించారు. గత నెల 31వ తేదీన సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్‌లో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు కె.సీతారామయ్య, కె.హరిచంద్రుడు, కె.మల్లికార్జునరావులు ఈ అవార్డులు అందుకున్నారని గుర్తుచేశారు.

రైలు పట్టాలపై గాలిపటాలు ఎగురవేయొద్దు

విద్యుదీకరించిన రైల్వే లైన్ల వద్ద గాలిపటాలు ఎగురవేయడాన్ని నివారించాలని డీఆర్‌ఎం రామకృష్ణ తెలిపారు. రైలు పట్టాలపై ఉన్న ఓవర్ హెడ్ హైటెన్షన్ వైర్లు 25 వేల ఓల్టుల విద్యుత్‌ను సరఫరా చేస్తుంటాయని తెలిపారు.

1999 బ్యాచ్ వైద్య విద్యార్థుల సేవలు ఆదర్శం

మంత్రి సత్యకుమార్ యాదవ్



బస్సుల ప్రారంభోత్సవంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎం.టి.కృష్ణబాబు, సుందరాచారి, యశస్వి రమణ తదితరులు

గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాల 1999 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థుల కోసం ఆ బ్యాచ్ ఇచ్చిన రూ. 80 లక్షల విరాళంతో కొనుగోలు చేసిన రెండు బస్సులను మంత్రి ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వవిద్యార్థుల సేవాగుణం అభినందనీయం అన్నారు. ఇప్పటివరకు రూ. 2 కోట్ల మేర విరాళం అందించడం ఆదర్శనీయం అని తెలిపారు. తర్వాత వారిని మెమోంటోలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, పూర్వ విద్యార్థులు బాహుబలి సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్ నాయక్, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ప్రభాకరరావు, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తీరు బాధాకరం

వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త, గుంటూరు డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు (డైమండ్ బాబు)



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు

నగరంపాలెం: ఇంటి గేట్లు, తలుపులు పగులకొట్టి, సామాన్లను బయటకు విసిరేసిన ఘటనలు ఇప్పటి వరకు గుంటూరు నగర చరిత్రలో జరగలేదని, స్టేషన్ అధికారి ఆధ్వర్యంలో దమనకాండ జరిగిందని వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త, గుంటూరు డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు (డైమండ్ బాబు) ఆరోపించారు. విద్యానగర్‌లో ఉంటున్న సోదరి ఇంటి విషయమై కొద్ది రోజులుగా జరుగుతున్న వరుస సంఘటలపై మరోసారి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేసేందుకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, డైమండ్‌బాబు సోదరి కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం డీపీఓకు వచ్చారు. ఈ మేరకు జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందించారు. అనంతరం డైమండ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ విద్యానగర్‌లో ఉంటున్న సోదరి ఇంటి విషయమై జరుగుతున్న వివాదంపై పట్టాభిపురం పీఎస్ పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉందని అన్నారు. కోర్టులో కొనసాగుతున్న కేసుపై సదరు పోలీసులు ఏకపక్షంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఇంటి తాళం చెవులను అవతలి వ్యక్తి అయిన విజయ్‌కి అప్పగించాలని స్పష్టంగా ఉందని అన్నారు. ఇటీవల అవతలి వర్గం వారు వివాదంలో ఉన్న ఇంటి వద్దకు 15 మందికి పైగా వచ్చి బీభత్సం సృష్టించారని చెప్పారు. ముఖాలకు మాస్కులు ధరించి, ఇంట్లో ఉన్న సోదరి, కుటుంబ సభ్యులు అందరిని బయటకు గెంటేశారని ఆరోపించారు. ఇంటి సామాన్లను బయటపడేసి బీభత్సం సృష్టించారని దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయగా సానుకూలంగా స్పందించారని అన్నారు. అంతేగాక డయల్ 112 నంబర్‌కు కూడా ఫిర్యాదు చేశానని గుర్తు చేశారు. సీఐ దృష్టికి తీసుకెళ్తే డాక్యుమెంటర్ కాగితాలు తీసుకురావాలని చెప్పారని అన్నారు. ఈలోగా గొడవ జరిగే ఇంటి వద్దకు వెళ్లేసరికి అవతలి వైపు ఉన్న విజయ్‌ను, ఇతరులను పంపించకుండా తమను అక్కడ్నుంచి పంపించారని చెప్పారు. వరుస ఘటనలతో భీతిల్లిపోయి, కోర్టును ఆశ్రయించామని అన్నారు. సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. సదరు స్టేషన్ పోలీసులు వ్యవహరించి తీరుపై వీడియోలను జిల్లా ఎస్పీకి దృష్టికి తీసుకొచ్చామని చెప్పారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అలజడి సృష్టిస్తున్నారని అన్నారు. డాక్యుమెంట్ కాగితాలను ఇతరత్రా క్లిపింగ్‌లను జిల్లా ఎస్పీకి అందించామని ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు.

రౌడీషీటర్ పాదర్తి రమేష్ అరెస్ట్

- బతికి ఉండగానే మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించిన కోర్టు కానిస్టేబుల్ రాజు
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు పాదర్తి రమేష్ గాంధీ పేరును వినియోగించిన వైనం
- విషయం బయటకు పొక్కడంతో రాజుపై చర్యలు తీసుకున్న జిల్లా ఎస్పీ
- పోలీసు చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు రౌడీషీటర్‌ను అరెస్ట్ చేసినట్లు విమర్శలు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ జయరాంప్రసాద్

లక్ష్మీపురం: రౌడీషీటర్ పాదర్తి రమేష్ బతికుండగానే మరణించినట్లు న్యాయస్థానంలో మరణ ధ్రువీకరణ పత్రాన్ని కోర్టు కానిస్టేబుల్ రాజు సమర్పించిన విషయం తెలిసిందే. నాలుగు కేసులలో నిందితుడైన రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు స్వర్గీయ పాదర్తి రమేష్ గాంధీ మరణాన్ని ఆసరాగా తీసుకుని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ రాజు అదే స్టేషన్‌లో పలు కేసుల్లో నిందితుడైన రౌడీషీటర్ కోసం ఈ పని చేశాడు. నాలుగు నాన్ బెయిలబుల్ కేసులు పెండింగ్‌లో ఉండటంతో రౌడీషీటర్‌ను పట్టాభిపురం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ బి.ఎం. జయరాంప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ మండలం కరాలపాడు గ్రామానికి చెందిన పాదర్తి రమేష్ గంజాయి కేసులో జైలు నుంచి విడుదల అయ్యాడు. గుంటూరులో ఉంటే తన ప్రత్యర్థి శివయ్య అనుచరులు హతమార్చుతారనే భయంలో 2017లో కుటుంబంతో హైదరాబాద్ వెళ్లాడు. రెండు సంవత్సరాల క్రితం బాపట్ల వచ్చి వాటర్ క్యాన్లు వేసే పనిలో చేరాడు. గుంటూరులో రమేష్ గాంధీపై పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులలో గుంటూరు న్యాయస్థానానికి హాజరైతే శివయ్య అనుచరులు హతమార్చుతారని భయపడ్డాడు. పట్టాభిపురం స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా గతంలో విధులు నిర్వహించిన రాజు అతడికి అనుకూలంగా వ్యవహరించాడు. దీనికోసం పాదర్తి రమేష్ గాంధీ అనే వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రాన్ని న్యాయస్థానంలో సమర్పించాడు. కొన్ని రోజుల తర్వాత ఈ విషయం తేలింది. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ దీనికి సంబంధించి రాజుపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. నగరంపాలెం స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ బి.ఎం. జయరాంప్రసాద్ నేతృత్వంలో రౌడీషీటర్‌ను పట్టాభిపురం సీఐ వీరేంద్ర బాబు తన సిబ్బందితో కలిసి బాపట్లలో అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు. కోర్టు కానిస్టేబుల్ రాజు డబ్బు కోసం చేసిన తప్పును కప్పిపుచ్చేందుకే ఇప్పుడు రమేష్‌ను అరెస్ట్ చేసి ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పూర్వ పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు తీర్మానం

తూములూరు (కొల్లిపర): మండలంలోని తూములూరు గ్రామంలో గత పంచాయతీ కార్యదర్శిపై సరిగా విధులు నిర్వహించలేదని గ్రామసభలో తీర్మానం చేసిన సంఘటన తూములూరులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. దీనిపై గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. గతేడాది అక్టోబర్‌లో పంచాయతీ కార్యదర్శి మృత్యుంజయరావు విధుల్లో ఉండగా జరిగిన గ్రామ సభలో ఇంటి పన్ను వసూలు సవరణకు చేసిన తీర్మానం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లలేదు. ఈ విషయం జనవరి 2వ తేదీన జరిగిన గ్రామ సభలో వెల్లడైంది. దీనిపై ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ బదిలీపై వెళ్లటం వల్ల ఆ పని చేయలేక పోయినట్లు పూర్వ పంచాయతీ కార్యదర్శి తెలిపినట్లు వెల్లడించారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామని తెలిపారు.

అంగన్‌వాడీల్లో పోస్టులను భర్తీ చేయాలి



లక్ష్మీపురం: గుంటూరు జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ల పోస్టులు భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ శుక్రవారం డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 1,485 అంగన్‌వాడీ కేంద్రాల్లో దాదాపు 100 చోట్ల సిబ్బంది కొరత ఉందన్నారు. అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 6 - 10వ తేదీ వరకు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలకు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు.

క్రికెట్ పోటీల చాంపియన్‌గా విజ్ఞాన్ వర్సిటీ



టీం సభ్యులను అభినందిస్తున్న వీసీ పి.నాగభూషణ్ తదితరులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ గ్రౌండ్‌లో 18వ ఎడిషన్ మహోత్సవ్-2కే25లో భాగంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ చాంపియన్‌షిప్ విజేతగా విజ్ఞాన్ వర్సిటీ నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలపై విజ్ఞాన్ జట్టు 25 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన విజ్ఞాన్ జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ జట్టు 6 వికెట్లు కోల్పోయి 74 పరుగులు మాత్రమే చేసింది. బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీపై ఎస్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు 16 పరుగుల తేడాతో గెలిచి మూడో స్థానంలో నిలిచింది. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తోపాటు విన్నర్‌కు రూ. 50వేలు, రన్నర్‌కు రూ.30 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, నాలుగో స్థానం పొందిన జట్టుకు రూ.10 వేల వంతున నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూలే దంపతుల కృషి చిరస్మరణీయం



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ కె.గంగాధరరావు తదితరులు

ఏఎన్‌యూ: దేశంలో మహిళా విద్యకు పూలే దంపతులు మార్గదర్శకులని వీసీ ఆచార్య కె. గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. వీసీ, యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, పరిశోధకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే సామాజిక సంస్కర్త, రచయిత, విద్యావేత్తగా సేవలు అందించారని కొనియాడారు. స్త్రీల అణచివేతను వ్యతిరేకించి సమాజంలో సమానత్వం కోసం కృషిచేశారన్నారు. మహిళలకు, అణగారిన వర్గాల ప్రజలకు విద్యను అందించడానికి పూలే దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే బాల్య వివాహాలను వ్యతిరేకించి వారికోసం మొదటి పాఠశాలలను ప్రారంభించారని తెలిపారు. వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించారని గుర్తుచేశారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ.. సమాజంలోని తారతమ్యాలను తొలగించడానికి సావిత్రిబాయి పూలే రచనల ద్వారా చైతన్యాన్ని తెచ్చారన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎం.త్రిమూర్తిరావు నివేదికను సమర్పించారు. ప్రిన్సిపల్స్ ఆచార్య ఎం. సురేష్ కుమార్, ఆచార్య పి.సిద్ధయ్య, ఆచార్య ఎ. ప్రమీలా రాణి, అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, గాంధీ అధ్యయన కేంద్రాల సంచాలకులు ఆచార్య వై.అశోక్ కుమార్, ఆచార్య పీజే రత్నాకర్, ఆచార్య కె.సోమశేఖర్, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు, సీఈ ఎ. శివప్రసాదరావు, నోడల్ ఆఫీసర్ ఆర్. ప్రకాశరావు, డీఈ వెంకటేశ్వర్లు, వికాస మాజీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జాతీయ బి.సి.సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు వై. నూకాలమ్మ, పూలే సెంటర్ ప్రోగ్రామర్ బి. కోటి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పెట్ సీటీ స్కాన్ ఏర్పాటు



పూజల్లో పాల్గొన్న డాక్టర్ యశస్వి రమణ, యడ్లపాటి అశోక్‌కుమార్ తదితరులు

గుంటూరు మెడికల్: క్యాన్సర్ రోగులకు శుభవార్త. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు అత్యంత ఖరీదైన, కీలకమైన అత్యాధునిక వైద్య పరికరం గుంటూరు జీజీహెచ్‌లో అందుబాటులోకి రానుంది. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సుమారు రూ.18 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేయనున్న జీఈ కంపెనీ పెట్ సీటీ స్కాన్ పరికరం ఏర్పాటుకు సంబంధించి టర్న్ కీ పనులకు శుక్రవారం ప్రారంభ పూజ నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ కొబ్బరి కాయ కొట్టి పూజ చేశారు. నాట్కో సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గిరిజావోలు దుర్గాప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 ఆవుల విజయ, జీఈ ప్రతినిధులు, నాట్కో క్యాన్సర్ సెంటర్ వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు. క్యాన్సర్ రోగులకు రాబోవు ఉగాది నాటికి పెట్ సీటీ స్కాన్ వసతి అందుబాటులోకి రావచ్చని సూపరింటెండెంట్ తెలిపారు.

ఏటీఎం మిషన్ ధ్వంసం

చోరీకి విఫలయత్నం



గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన నకరికల్లులోని ఏటీఎం మిషన్

నకరికల్లు: ఏటీఎంలో చోరీకి గుర్తుతెలియని దుండగులు విఫలయత్నం చేశారు. డబ్బు చోరీ చేసేందుకు వీలుపడకపోవడంతో ఏటీఎం పరికరాన్ని ధ్వంసం చేసి స్క్రీన్, కీబోర్డ్, ఇతర సామగ్రిని పగులగొట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన అండర్ పాస్ దగ్గర ఇండియా వన్ ఏటీఎంను ఏర్పాటు చేశారు. ఏటీఎం వద్ద సెక్యూరిటీ ఎవరూ ఉండరు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో మాత్రమే ఏటీఎం ఉంటుంది. గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఏటీఎంలోకి ప్రవేశించి డబ్బును చోరీ చేసేందుకు యత్నం చేశారు. డబ్బును బయటకు తీయడం వీలు కాకపోవడంతో కంప్యూటర్ పరికరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. గతంలో కూడా ఇదే ఏటీఎంలో చోరీ జరిగింది. ఘటనపై శుక్రవారం నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

న్యాయవాది కామేపల్లి కృషిబాబుకు ఘన నివాళి



కృషిబాబు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

బాపట్ల: హైకోర్టు న్యాయవాది కామేపల్లి కృషిబాబు తమకు ఆత్మీయుడని మహారాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి వి.కె.పాటిల్ తమ్ముడు రాజేంద్ర వి.కె.పాటిల్ పేర్కొన్నారు. ఇటీవల స్వర్గస్తులైన నరసాయపాలేనికి చెందిన కామేపల్లి కృషిబాబు చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కృషిబాబు తన క్లాస్‌మేట్ అని, ఇద్దరం కలిసే ఉండే వారమని రాజేంద్ర గుర్తు చేసుకున్నారు. కృషిబాబు కుటుంబ సభ్యులు కామేపల్లి భూపాల్‌ను పరామర్శించి సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, శాంతారం, మానం విజేత, రాంబాబు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా సిరాజుద్దీన్



భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధికార ప్రతినిధిగా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలుకు చెందిన సయ్యద్ సిరాజుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయనకు నియామక పత్రం అందింది. పార్టీ కార్యకలాపాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న సిరాజుద్దీన్ నిబద్ధతను గుర్తించిన వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అధికార ప్రతినిధిగా నియమించేందుకు కృషి చేశారు. సిరాజుద్దీన్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

క్రోసూరు: మండలంలోని పీసపాడు గ్రామ శివారులో గురువారం రాత్రి రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ నాగేంద్రరావు శుక్రవారం తెలిపారు. వివరాలు తెలుపుతూ సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ల గ్రామానికి చెందిన కొల్లి లక్ష్మయ్య(45) సొంత పనులపై ద్విచక్రవాహనంపై క్రోసూరు వైపు వస్తూ పీసపాడు అడ్డరోడ్డు సమీపంలో గెదెలు తగిలి కింద పడిపోయాడు. తలకు దెబ్బతగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు కలరని, మృతదేహానికి పోస్టుమార్టం పూర్తిచేయించి కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

హైవేపై ఓలేరు వద్ద కారు బోల్తా

సురక్షితంగా బయట పడిన ఇద్దరు

భట్టిప్రోలు: ఎన్‌హెచ్ 216 ఏ రహదారిపై భట్టిప్రోలు మండలం ఓలేరు సమీపంలో కారు ప్రమాదవశాత్తూ బోల్తా కొట్టిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రేపల్లెకు చెందిన టి. జాష్వి కారు డ్రైవింగ్ చేస్తూ మరో వ్యక్తితో కలసి భట్టిప్రోలు వైపు హైవేపై వస్తున్నారు. ఓలేరు దాటిన తరువాత ఒక్కసారిగా కంగారు పడి బ్రేక్ వేయబోయి ఎక్స్‌లేటర్ తొక్కడంతో పక్కనే ఉన్న పంట పొలాల్లోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ స్వల్ప గాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. 108 వాహన సిబ్బంది వారిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

కవి డాక్టర్ కత్తి పద్మారావు



సభలో మాట్లాడుతున్న కత్తి పద్మారావు

పొన్నూరు: దేశంలో స్త్రీ విద్యా విప్లవాన్ని ప్రారంభించిన సాంస్కృతిక యోధురాలు సావిత్రిబాయి పూలే జయంతిని రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని దళిత మహాసభ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కవి డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. శుక్రవారం లుంబినీవనంలోని అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. కత్తి పద్మారావు, మాతా రమాబాయి అవార్డు గ్రహీత కత్తి స్వర్ణకుమారి, రీసెర్చ్ సెంటర్ సభ్యురాలు దాసరి శ్యామల, కట్టా సృజన, గేరా ప్రసన్న, రాణి, శాంతి, హేమ, మాధవ్, అక్కిదాసు జాషువా, షబ్బీర్ అలీ, పాల్గొన్నారు. లుంబినీవనంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కత్తి పద్మారావు మాట్లాడుతూ.. మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వంపై ముప్పై ఏళ్లుగా పోరాడుతున్నామని అన్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రకటించడం హర్షణీయమన్నారు. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను 6వ తరగతి నుంచి ఎంఏ వరకు పాఠ్యాంశంగా పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి స్కూల్లో ఆమె చిత్రపటాలు, విగ్రహాలను ఆవిష్కరించాలని కోరారు. రెండు రాష్ట్రాలలో ఆమె పేరిట మహిళా విశ్వ విద్యాలయాలను నెలకొల్పాలని అన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం



హరికృష్ణ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మేదరమెట్ల: గుర్తు తెలియని వాహనం మోపెడ్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈఘటన కొరిశపాడు జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. జే.పంగులూరు మండలం రేణింగవరం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి హరికృష్ణ (29) కొరిశపాడులోని పొగాకు కంపెనీలో కూలీలకు ఉదయాన్నే టీ అందజేసి తిరిగి వెళుతున్నాడు. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం మోపెడ్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో హరికృష్ణ రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఢీకొన్న వాహనం అక్కడ నుంచి వెళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు మేదరమెట్లలో ఓ మెడికల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
శనివారం ॥ 4-1-2025

న్యూస్‌మేకర్స్



గ్రీన్ ఆర్మీ

ఇది ఓ జనతా గ్యారేజ్

ఉత్తరప్రదేశ్‌లో గతంలో 'గులాబ్ గ్యాంగ్' ఘనత విన్నాం. ఇప్పుడు 'గ్రీన్ ఆర్మీ'. స్త్రీల మీద జరిగే దురాగతాలను స్త్రీలే ఉమ్మడిగా ఎదిరిస్తూ బాధితులకు బాసటగా నిలుస్తున్నారు. వారణాసిలో క్రియాత్మకంగా ఉన్న 'గ్రీన్ ఆర్మీ' మహిళా బృందాన్ని ప్రధాని మోదీ ఇటీవలి మన్‌కీ బాత్‌లో ప్రశంసించారు.



వాళ్లంతా ఒక 50 మంది ఉంటారు. ఆకుపచ్చ చీరల్లో, చేతి కర్రతో వరుసగా నడుస్తూ ఊళ్లోకి వస్తారు. ఇక ఊళ్లోని మగాళ్లకు గుండె దడే. భార్యలను కొట్టే వాళ్లు, తాగుబోతులు, పేకాట రాయుళ్లు, మత్తు పీల్చేవాళ్లు, కట్నం కోసం వేధించే వాళ్లు... ఎక్కడికక్కడ సెట్‌రైట్ కావాల్సిందే. ఎందుకంటే వారు 'గ్రీన్ ఆర్మీ'. అందరి స్క్రూలు టైట్ చేసే ఆర్మీ. అందుకే మొన్నటి 'మన్ కీ బాత్'లో వీరి గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ 'వీరి ఆత్మనిర్భరతకు, కృషికి అభినందనలు. నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని తెలిపారు. దాంతో గ్రీన్ ఆర్మీలో కొత్త జోష్ వచ్చింది.

వారణాసి చుట్టుపక్కల

గ్రీన్ ఆర్మీ 2014లో పుట్టింది. బెనారస్ హిందూ యూనివర్సిటీలో చదువుకున్న రవి మిశ్రా వారణాసి చుట్టుపక్కల పల్లెల్లో ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్ ఉత్తర జిల్లాలలో గృహహింస ఎక్కువగా ఉందని గమనించాడు. స్త్రీలకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్పిస్తే వారు ఆత్మరక్షణ చేసుకోగలరని అనుకున్నాడు. కొందరు విద్యార్థులతో కలిసి నిర్మలాదేవి అనే గృహిణిని గృహ హింసను ప్రతిఘటించమని కోరాడు. రైతు కూలీగా ఆమె సంపాదించేదంతా ఆమె భర్త లాక్కుని తాగేవాడు. కొట్టేవాడు. నిర్మలా దేవి విద్యార్థుల స్ఫూర్తితో ఆత్మరక్షణ నేర్చుకుంది. అంతేకాదు గ్రామంలోని మరికొంతమందిని జమ చేసింది. అందరూ కలిసి ఇక గృహ హింసను ఏ మాత్రం సహించమని ఎలుగెత్తారు. అంతేకాదు.. కర్ర చేతబట్టి మాట వినని భర్తలకు బడితె పూజ చేశారు. నిర్మలాదేవి భర్త దారికొచ్చాడు. దాంతో గ్రీన్ ఆర్మీ పేరు వినపడసాగింది.

270 పల్లెల్లో...

వారణాసిలో, చుట్టుపక్కల జిల్లాల్లో ఇప్పుడు 270 గ్రామాల్లో గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు ఉన్నారు. 2000 మంది స్త్రీలు ఇందులో భాగస్వాములు. ప్రతి ఊరిలో ఇరవై నుంచి యాభై మంది స్త్రీలు ఆకుపచ్చ చీరల్లో దళంగా మారి క్రమం తప్పక ఇంటింటికీ వెళ్లి సమస్యల ఆచూకీ తీస్తారు. వాటికి పరిష్కారాలు వెదుకుతారు. స్త్రీల మీద చెయ్యెత్తడం అనేది వీరు పూర్తిగా ఊళ్లల్లో నిర్మూలించారు. ఇక తాగుడు పరిష్కారం కోసం తాగుబోతులకు కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించారు. పేకాట, డ్రగ్స్‌కైతే స్థానమే లేదు. గ్రీన్ ఆర్మీతో స్థానిక పోలీస్ కాంటాక్ట్‌లో ఉంటుంది. ఎవరైనా గ్రీన్ ఆర్మీకి ఎదురు తిరిగితే పోలీసులు వచ్చి చేయవలసింది చేస్తారు. వరకట్న సమస్య ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా ఉంది. 'మీకు కట్నం ఎందుకు ఇవ్వాలి... సరంజామా ఎందుకివ్వాలి' అని గ్రీన్ ఆర్మీ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. దాంతో గొంతెమ్మ కోరికలు పూర్తిగా తగ్గాయి. ఇచ్చింది పుచ్చుకుంటున్నారు.

ఆడపిల్లే అదృష్టం

కొన్ని జిల్లాల్లో ఇప్పటికీ ఆడపిల్ల పుడితే శోకం వ్యక్తం చేస్తారు. ఏడుస్తూ గుండెలు బాదుకుంటారు. కాని గ్రీన్ ఆర్మీ బయలుదేరి ఈ శోకానికి ముగింపు చెప్పింది. 'ఆడపిల్ల అంటే లక్ష్మి అని ఇంటికి భాగ్యమనీ బాగా చదివిస్తే సరస్వతి అని, శక్తిలో దుర్గ అని... ఆడపిల్లను మగపిల్లాడితో సమానంగా చూడాల'ని ఇంటింటికి తిరిగి చైతన్యం కలిగించారు. ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లులకు రక్షణగా నిలబడ్డారు. ఇవన్నీ సాంఘికంగా చాలా మార్పు తెచ్చాయి. అందుకే ఒక్కరు కాకుండా సమష్టిగా ప్రయత్నిస్తే విజయాలు వస్తాయి. గ్రామీణ జీవితంలో స్త్రీలకు ఇంకా ఎన్నో ఆటంకాలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎన్నో సమస్యలు ఉన్నాయి. కర్రచేత బట్టి ఆర్మీగా మారకపోయినా స్త్రీలు సంఘాలు ఏర్పరుచుకుంటే సమస్యలు దూరం కాకపోవడం ఉండదు. గ్రీన్ ఆర్మీ ఇస్తున్న సందేశం అదే.

ఈత – ఘనత



55 ఏళ్లు.. 150 కిలోమీటర్లు

కొందరు ఓటమి నుంచి విజయాలు అందుకుంటారు. మరికొందరు తమ జీవితంలో ఎదురైన ప్రతిబంధకాల నుంచి బయటపడేందుకు ఏదో సాధించాలనే తపనతో ముందుకు సాగుతారు. ఆ కోవకు చెందిన వారే స్విమ్మర్ గోలి శ్యామల. సామర్లకోటకు చెందిన శ్యామల భర్త మోహన్ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి. కుమారుడితో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో యానిమేషన్ స్టూడియో పెట్టుకుని పలు సీరియళ్లు, సినిమాలకు పనిచేశారు. దురదృష్టవశాత్తూ స్టూడియో ద్వారా తీవ్రంగా నష్టపోవడంతో మానసికంగా మనోవేదనకు గురయ్యారు. దాంతో ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. 45 ఏళ్ళ వయసులో శరీరం సహకరించని స్థితిలో మనసును మళ్ళించేందుకు హైదరాబాద్‌లో స్విమ్మింగ్ నేర్చుకున్నారు. స్వతహాగా ఆమె స్విమ్మర్ కాదు... అయితేనేం, నాటి మనోవేదనకు ఉపశమనంగా ప్రారంభించిన స్విమ్మింగ్ నేడు ఐదు పదుల వయసులో ఆమెను సముద్రాలు దాటే సాహస యాత్రికురాలిగా తీర్చిదిద్దింది.

150 కిలోమీటర్లు ఏడు రోజుల్లో అలవోకగా..

డిసెంబరు 28న విశాఖలోని ఆర్‌కే బీచ్ వద్ద సముద్ర తీరంలో ఈత ప్రారంభించిన శ్యామల శుక్రవారం కాకినాడ తీరం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో మాట్లాడుతూ యానిమేషన్ స్టూడియోలో నష్టం రావడంతో డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయిన తాను మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు స్విమ్మింగ్ ప్రారంభించాననీ, కోచ్ జాన్‌సిద్ధిక్ సహకారంతో జీరో లెవెల్ నుంచి 150 కిలోమీటర్ల స్విమ్ చేసేలా తయారయ్యానని సగర్వంగా చెప్పారు. 2021లో శ్రీలంక నుంచి ఇండియా వరకు రామ్‌సేతు దాటానని, తాజాగా ఫిబ్రవరిలో లక్షద్వీప్‌లో స్విమ్ చేశానన్నారు. బంగాళాఖాతంలో 150 కిలోమీటర్లు ఈదడం ద్వారా ఆసియా స్థాయిలో ఘనత సాధించానన్నారు. విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు ఈదాలని రెండేళ్ళ కిందటే నిర్ణయించుకున్నానని, అయితే రెండుసార్లు వాతావరణం అనుకూలించలేదనీ, ఎట్టకేలకు డిసెంబర్ 28న చిన్న ఫిషింగ్ బోట్, ఇద్దరు స్కూపర్ డ్రైవర్స్‌తో ప్రారంభించానన్నారు. ఆర్కే బీచ్‌లో సముద్రంలో ప్రవేశించాక మళ్ళీ కాకినాడలో నేలపైకి వచ్చామన్నారు. మొదటి రోజు 7 గంటల్లోనే 30 కిలోమీటర్ల దూరం ఈదానన్నారు. తరువాత నుంచి ఈరోజు వరకు అనేక ఒడుదొడుకులను అధిగమిస్తూ ఈదుకుంటూ వచ్చానన్నారు. తల వెంట్రుకల నుంచి కాలి గోళ్ల వరకు స్విమ్మింగ్ వల్లే ఆరోగ్యం కలుగుతుందని, స్విమ్మింగ్‌ను స్పోర్ట్‌గా కాకుండా సర్వైవల్ స్పోర్ట్‌గానే చెబుతానన్నారు. మహిళలు ఈత చేయడం వలన గైనిక్ సమస్యలు తగ్గుతాయన్నారు.

– లక్కింశెట్టి శ్రీనివాసరావు
సాక్షి ప్రతినిధి.. కాకినాడ.
ఫోటోలు: విశ్వనాధుల రాజబాబు.
కాకినాడ రూరల్



హేళన చేసిన వారే పొగుడుతున్నారు

సముద్రంలో ఈత కోసం తొలి ప్రయత్నం చేసినప్పుడు చాలామంది హేళన చేశారు. కొందరు యూట్యూబ్‌లో కామెంట్లు పెట్టారు. వాటిని పట్టించుకోలేదు. అరేబియా సముద్రం ఈదాను. శ్రీలంక నుంచి ఇండియా ఈత మరపురానిది. మేదీ స్ఫూర్తితో లక్షద్వీప్‌లో 18గంటల పాటు 48 కిలోమీటర్లు ఈదాను. వైజాగ్ నుంచి కాకినాడ 150 కిలోమీటర్లు ఈదగలిగినందుకు చాలా హ్యాపీగా ఉంది.

– గోలి శ్యామల – స్విమ్మర్.

ముగ్గు ముచ్చట



దామరాజు లక్ష్మి
ఆర్.ఆర్.పేట,
ఏలూరు.

22 చుక్కలు, 10 వరసలు,
10 వచ్చే వరకు, చుక్క వదిలి చుక్క.







17 చుక్కలు,
5 వరసలు,
5 వచ్చే వరకు,
సరి చుక్క.

బెన్నూరి
ఉమాదేవి
సికింద్రాబాద్

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్
రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com



నగధగలు

బంగారం ఎక్కడైనా బంగారమే



ప్రపంచంలో ఏ దేశంలోనైనా బంగారం అత్యంత విలువైన లోహంగా గౌరవం అందుకుంటోంది. బంగారం స్వచ్ఛత గురించి ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క నిష్పత్తిని అనుసరిస్తుంటారు. స్వచ్ఛమైన బంగారం అంటే 24 క్యారట్‌ల బంగారం. ఆభరణం తయారు చేయాలంటే కొన్ని ఇతర లోహాల మిశ్రమాన్ని బంగారంలో కలుపుతారు. బంగారం మెత్తటి లోహం. కాబట్టి ఆభరణం ఆకారం గట్టిదనం కోసం ఇతర లోహాలను కలపాలి. అలా లోహపు మిశ్రమాల కలయిక తర్వాత ఆభరణం తయారు చేయడానికి ఉపయోగించే బంగారం స్వచ్ఛత 22 క్యారట్‌లు ఉంటుంది.

- క్యారట్ అనే పదం అయోమయానికి గురి చేస్తుంది. బంగారం స్వచ్ఛత విషయంలో ఉపయోగించే క్యారట్ అనే పదం ఇంగ్లిష్ అక్షరం 'కె'తో సూచిస్తారు. మరో క్యారట్ రాళ్ల (వజ్రంతో సహా అన్ని రకాల రాళ్లు) బరువును సూచించే పదం. ఈ క్యారట్‌ను 'సి'తో అనే అక్షరంతో సూచిస్తారు. ఒక క్యారట్ అంటే 200 మిల్లీగ్రాములు.
- బంగారం ధర పెరగడం వల్ల ఆభరణాల తయారీలో 22 క్యారట్‌లకు బదులు 18, 14, 9 క్యారట్ స్వచ్ఛతతో ఆభరణాలు చేస్తున్నారు. క్యారట్ స్వచ్ఛత తగ్గేకొద్దీ గట్టిదనం పెరుగుతుంది. వజ్రాలు పొదిగే ఆభరణాలకు సాధారణంగా 18 క్యారట్ బంగారం ఉపయోగిస్తారు. ఇప్పుడు 9 క్యారట్ బంగారంతో కూడా వజ్రాల ఆభరణాలు చేస్తున్నారు.
- తక్కువ క్యారట్ బంగారు ఆభరణాలను కొంటే తిరిగి అమ్మేటప్పుడు ఆ బంగారానికి విలువ రాదనే అపోహ చాలామందిలో ఉంటుంది. నిజానికి మనం కొన్న ఆభరణంలో ఎంత నిష్పత్తి బంగారం ఉందో కరిగించినప్పుడు ఆ మేరకు బంగారమే తిరిగి వస్తుంది. బీఐఎస్ హాల్‌మార్క్ వేసిన 18 క్యారట్ బంగారాన్ని కరిగిస్తే 75 శాతం బంగారం వస్తుంది. అంతకంటే క్యారట్ తగ్గితే ఆ మేరకే బంగారం వస్తుంది. అంతే తప్ప తిరిగి ఏమీ రాదనేది అపోహ మాత్రమే. సర్టిఫికేట్‌లో ఆభరణంలో ఉన్న బంగారం స్వచ్ఛతతో పాటు క్యారట్ వివరం తాలూకు పర్సెంటేజ్ కూడా ఉంటుంది.



– విశేషిణి రెడ్డి,
జీఐఏ జెమ్మాలజిస్ట్

బ్యూటిప్

సిట్రస్ ఫ్రెషనర్‌తో ముఖాన్ని శుభ్రం చేస్తుంటే రోజంతా తాజాగా ఉంటుంది. ఇందుకోసం రెండు కప్పుల నీళ్లు, నిమ్మరసం, నిమ్మతొక్కలు కావాలి. ఒక పాత్రలో నీటిని మరిగించి అందులో నిమ్మ తొక్కలను వేసి మూత పెట్టి రాత్రంతా అలాగే ఉంచాలి. మరుసటిరోజు ఉదయం నిమ్మతొక్కలను తీసివేసి ఆ నీటిలో తాజా నిమ్మరసాన్ని కలిపి స్ప్రే బాటిల్‌లో పోసుకోవాలి. దీనిని ముఖం మీద స్ప్రే చేసుకుని పది నిమిషాల తర్వాత తుడిచేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా ఉంటుంది. స్ప్రే బాటిల్ తప్పనిసరి కాదు. ఈ మిశ్రమంలో దూదిని ముంచి ముఖానికి పట్టించినా కూడా సాంత్వన లభిస్తుంది. నిమ్మ తొక్కలకు బదులుగా ఆయా కాలాల్లో దొరికే కమలా, బత్తాయి వంటి పండ్ల తొక్కలను కూడా వాడుకోవచ్చు.

కల్లోల కాలం



ఆ అమ్మ సునామీకి జన్మనిచ్చింది!

**ఎప్పుడూ చూసే సముద్రమే ఆ రోజు కొత్తగా ఉంది.
భయంగా ఉంది.
ఎప్పుడూ నవ్వుతూ పలకరించే సముద్రం
విలయవిధ్వంసానికి సిద్ధంగా ఉంది.
ఆరోజు... ఏ రోజూ మరచిపోలేని రోజు.
సునామీ విశ్వరూపాన్ని చూపిన రోజు.
ఇరవై సంవత్సరాల తరువాత కూడా...
నిన్ననే జరిగినట్లు వెన్నులో చలిపుట్టించే రోజు...**



సునామీ రాయ్, నమిత రాయ్

అండమాన్ నికోబార్‌లోని హట్ బే దీవిలో భీకర అలల ధాటికి నమిత రాయ్ ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నది. అప్పుడు నమిత వయసు పాతిక సంవత్సరాలు. దిక్కుతోచని పరిస్థితుల్లో పాములకు ప్రసిద్ధి చెందిన అడవిలో ఆశ్రయం పొందారు. ఎటు నుంచి ఏ విషసర్పం వచ్చి ప్రాణం తీస్తుందో తెలియని భయానక పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లోనే ఆ పాముల అడవిలోనే పండంటి పిల్లాడికి జన్మనిచ్చింది నమిత.

ఆ పిల్లాడికి 'సునామీ' అని పేరు పెట్టారు.

రెండు దశాబ్దాల తరువాత మళ్లీ ఆ రోజుల్లోకి వెళ్లింది నమిత రాయ్...

'ఆ చీకటి రోజును గుర్తు చేసుకుంటే ఇప్పటికీ ఒంట్లో వణుకు పుడుతుంది. అప్పుడు నేను గర్భవతిని. రోజువారీ పనులతో బిజీగా ఉన్నాను. ఉన్నట్టుండి భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది. మా తీరం నుండి మైళ్ళ దూరంలో సముద్రం తగ్గుముఖం పట్టడం చూసి షాక్ అయ్యాను. కొన్ని సెకనుల తరువాత మా దీవి వైపు భారీ సముద్రపు అలలు దూసుకొస్తున్నాయి, ఆ తర్వాత బలమైన ప్రకంపనలు వచ్చాయి. ప్రజలు కేకలు వేస్తూ గుట్ట వైపు పరుగెత్తడం చూశాను. పానిక్ ఎటాక్ వచ్చి స్పృహ తప్పి పడిపోయాను.

కొన్ని గంటల తరువాత స్పృహలోకి వచ్చాను. కొండ అడవిలో వేలాది మంది స్థానికుల మధ్య నేను ఉన్నాను. నా భర్త, పెద్ద కొడుకును చూడగానే ప్రాణం లేచి వచ్చింది. మా ద్వీపంలోని చాలా ప్రాంతాలు రాక్షస అలల తాకిడికి నాశనం అయ్యాయి. ఆస్తి అనేది లేకుండా పోయింది.

ఒకరోజు రాత్రి పదకొండు గంటల తరువాత నాకు పురిటినొప్పులు వచ్చాయి. కానీ చుట్టుపక్కల డాక్టర్లు ఎవరూ లేరు. నేను ఒక బండరాయిపై పడుకొని సహాయం కోసం ఏడ్చాను. నా భర్త ఎంత ప్రయత్నించినా వైద్యసహాయం అందలేదు. అడవిలో ఆశ్రయం పొందిన కొందరు మహిళలను నా భర్త వేడుకున్నాడు. వారి సాయంతో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సునామీకి జన్మనిచ్చాను.

తిండి లేదు. సముద్రానికి భయపడి అడవి నుండి బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో నా బిడ్డ బతుకుతాడా అనే బాధ మొదలైంది. కొబ్బరి నీళ్లే ఆహారమయ్యాయి. లాల్ టిక్రీ హిల్స్‌లో నాలుగు రాత్రులు గడిపిన మమ్మల్ని రక్షణ సిబ్బంది కాపాడారు. చికిత్స కోసం నన్ను పోర్ట్ బ్లెయిర్‌లోని జీబీ పంత్ ఆసుపత్రికి ఓడలో తీసుకువెళ్లారు. హట్ బే నుంచి పోర్ట్ బ్లెయిర్‌కు 117 కిలోమీటర్‌ల దూరం. సుమారు ఎనిమిది గంటల సమయం పట్టింది' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది నమిత.

కోవిడ్ మహమ్మారి సమయంలో భర్త లక్ష్మీ నారాయణ మరణించడంతో ఇద్దరు కుమారులు సౌరభ్, సునామీలతో కలిసి పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీలో నివసిస్తుంది నమితా రాయ్.

నమిత పెద్ద కుమారుడు సౌరభ్ ఒక ప్రైవేట్ షిప్పింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు సునామీ 'ఓషనోగ్రాఫర్' కావాలనుకుంటున్నాడు.

'మా అమ్మే నాకు సర్వస్వం. ఆమె ధైర్యశాలి. నాన్న చనిపోయాక మమ్మల్ని పోషించడానికి చాలా కష్టపడింది. ఫుడ్ డెలివరీ సర్వీసును నిర్వహించింది. దానికి సునామీ కిచెన్ అని సగర్వంగా పేరు పెట్టింది' అంటున్నాడు సునామీ రాయ్.

'2004లో సమర్థవంతమైన హెచ్చరిక వ్యవస్థ లేకపోవడంతో పెద్ద ఎత్తున విధ్వంసం, ప్రాణ నష్టం జరిగింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 1,400కు పైగా హెచ్చరిక కేంద్రాలు(వార్నింగ్ స్టేషన్స్) ఉన్నాయి. సునామీ నాటి పరిస్థితిని ఎదుర్కొనేందుకు మేము సర్వసన్నద్ధంగా ఉన్నాం' అంటున్నారు అండమాన్ నికోబార్ దీవుల అడ్మినిస్ట్రేషన్ సీనియర్ అధికారులు.

వంటిల్లు

అరిశెలు



కావలసినవి:
బియ్యం – ఒక కిలో; బెల్లం పొడి – 800 గ్రా.; నువ్వులు, గసగసాలు– కొద్దిగా; నెయ్యి – కేజీ

తయారి:
- బియ్యాన్ని ముందు రోజు రాత్రి కడిగి నానబెట్టాలి. ఉదయాన్నే నీళ్లను వంపేసి తడిగా ఉన్నప్పుడే దంచాలి. దంచిన పిండిని జల్లించాలి. పిండి గాలికి పొడిబారకుండా ఒక పాత్రలో వేసి అదిమి మూత పెట్టాలి.
- ఇప్పుడు పాకం సిద్ధం చేసుకోవాలి. మందపాటి పాత్రలో ఒక గ్లాసు నీరు పోసి బెల్లం పొడి వేసి పాకం వచ్చేదాకా తెడ్డుతో కలుపుతూ మరిగించాలి. పాకం వచ్చిన తర్వాత స్టవ్ మీద నుంచి దించేసి బియ్యప్పిండి వేసి ఉండలు కట్టకుండా తెడ్డుతో కలపాలి.
- బాణలిలో నెయ్యి పోసి కాగనివ్వాలి. పాకంపిండిని పెద్ద నిమ్మకాయంత తీసుకుని గసాలు, నువ్వులలో అద్ది పాలిథిన్ పేపర్ మీద పెట్టి వేళ్లతో వలయాకారంగా అద్ది కాగిన నెయ్యిలో వేసి దోరగా కాలిన తర్వాత తీసి అరిశెల పీట మీద వేసి అదనంగా ఉన్న నెయ్యి కారిపోయేటట్లు వత్తాలి.

గమనిక: అరిశె మెత్తగా రావాలంటే పాకం లేతగా ఉన్నప్పుడే బియ్యప్పిండి కలుపుకోవాలి. గట్టిగా ఎక్కువ తీపితో కావాలనుకుంటే ముదురు పాకం పట్టాలి.
- ఈ అరిశెలు పదిహేను రోజుల వరకు తాజాగా ఉంటాయి.

నువ్వుల కజ్జికాయ



కావలసినవి: మైదా లేదా గోధుమ పిండి – కేజీ; నువ్వులు – కేజీ; బెల్లం పొడి – 800 గ్రా.; ఏలకులు– 10 గ్రా. జీడిపప్పు– వందగ్రాములు; నూనె– కేజీ;

తయారి:
- పిండిని చపాతీలకు కలుపుకున్నట్లుగా కలుపుకుని పక్కన ఉంచుకోవాలి.
- నువ్వులను దోరగా వేయించి చల్లారిన తర్వాత కాస్త పలుకుగా గ్రైండ్ చేయాలి. బెల్లం పొడి, యాలకుల పొడి వేసి అన్నీ సమంగా కలిసే వరకు కలపాలి.
- గోధుమ పిండిని చిన్న గోళీలుగా చేసుకోవాలి. ఒక్కొక్క గోళీని ప్రెస్సర్‌తో పూరీలా వత్తుకుని దానిని సాంచా (కజ్జికాయ చేసే చెక్క మౌల్డ్) లో పరిచి ఒక స్పూను నువ్వులు, బెల్లం మిశ్రమాన్ని, ఒక జీడిపప్పును పెట్టి సాంచా మూత వేయాలి.
- సాంచాలో నుంచి తీసి కజ్జికాయను మరుగుతున్న నూనెలో వేసి దోరగా కాలనివ్వాలి.

ఇవి దాదాపుగా ఇరవై రోజుల వరకు తాజాగా ఉంటాయి.